క్లుప్తంగా...

కొనసాగుతున్న సత్కారాలు



ఎమ్మెల్యే గాంధీని సత్కరిస్తున్న గోకుల్‌ఫ్లాట్స్‌వాసులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆరెకపూడి గాంధీని ప్రకటించినప్పటి నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ రంగాల వారి సత్కారాలు కొనసాగుతున్నాయి. ఆదివారం మాదాపూర్ డివిజన్ గోకుల్‌ఫ్లాట్స్, కొండాపూర్ డివిజన్ మార్తాండనగర్‌కు చెందిన వారు భారీ గజమాలతో గాంధీని సత్కరించి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరూ సమష్టిగా కృషి చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి గెలిపించి తమ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టానున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ తెలిపారు. సోమవారం రూ.4 కోట్లతో చేపట్టే బాక్స్ కల్వర్ట్, వరదనీటి కాలువల నిర్మాణ పనులకు కార్పొరేటర్లు మంజులారఘునాథ్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు.

డోయన్స్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

శేరిలింగంపల్లి: అపోలో హాస్పిటల్స్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలితో అనేక వ్యాధులకు గురవుతున్నారని, చిన్నపాటి జాగ్రత్తలు వహిస్తే ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. నిత్యం వ్యాయామం, వాకింగ్, యోగా చేస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. తాజా పండ్లు, ఆకు కూరలు, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు తీసుకోవాలన్నారు. శిబిరానికి హాజరైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పృథ్వీ గణేష్, విశ్వనాథ్, యూసుఫ్, లింగారెడ్డి, ఐఎస్ రామిరెడ్డి, అనంతకుమార్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విష్ణు ప్రసాద్, శివరామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న రజనీకాంత్‌రెడ్డి

గచ్చిబౌలి/రాయదుర్గం: ఓటర్ల జాబితా ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగింది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలు, జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక క్యాంపెయిన్ శని, ఆదివారాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫామ్–6, 8లను అందుబాటులో ఉంచారు.

నానక్‌రాంగూడ, ఖాజాగూడలో..

గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడ ప్రభుత్వ పాఠశాల, ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఇతర అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లు వచ్చి వారు అడుగుతున్న తీరు, అధికారులు ఇచ్చిన సమాధానాలను వారు స్వయంగా పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు.

- శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 2,3వ తేదీల్లోనూ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

నేడు జాబ్ మేళా

గోల్కొండ: నిరుద్యోగుల కోసం సోమవారం 96వ హైదరాబాద్ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు, డెకెన్ బ్లాస్టర్స్ ప్రతినిధి మన్నాన్‌ఖాన్ తెలిపారు. టోలిచౌకీ అల్మా ఫంక్షన్ హాల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 10వ తరగతి పాసైన వారి నుంచి బీటెక్, బీఫార్మ, ఎంఫార్మతో పాటు ఏదైనా ఒక డిగ్రీ ఉన్న వారు విద్యార్హత ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరుకావచ్చునని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 83743 15052 నెంబర్‌లో సంప్రదించాలి.

మైనార్టీల అభివృద్ధికి నిరంతరం కృషి



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



సన్మానిస్తున్న పీఅండ్‌టీ కాలనీ అసోసియేషన్ సభ్యులు

అత్తాపూర్: సీఎం కేసీఆర్ ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గం సులేమాన్ నగర్ డివిజన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. మరోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యేకు సన్మానం

బండ్లగూడ: నిరంతరం ప్రజల్లో ఉంటూ వారికి మెరుగైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకాష్‌గౌడ్‌కు మరోసారి అవకాశం కల్పించడంతో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పీఅండ్‌టీకాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను ఆదివారం కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ చైర్మన్ ఎండీ షఫీ, అధ్యక్షుడు నదీమ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హఫీజ్‌ఖాన్, ఆరిఫ్, జుబేర్, కుత్బుద్దీన్, రోహిత్ తదితరులున్నారు.

కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్

రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ వెల్లడించారు. కాటేదాన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం.చంద్రమోహన్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేలా కార్మికులందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్, జగదీష్, రుద్రకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, స్వప్న, జిల్లా కమిటీ సభ్యులు బుగ్గ రాములు, వీరన్న, ఎల్లన్న, శ్రీను, పార్వతి, కృష్ణ, మల్లేష్, ప్రవీణ్, బాలరాజు, ఎల్లేష్, చైతన్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీతారంజిత్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

రాజేంద్రనగర్: చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి సతీమణి సీతా తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవికాటి శ్రావణ్, శివగౌడ్ తదితరులున్నారు.

మణికొండ: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా ఎంపికైన చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు ఆధ్వర్యంలో ఆమె నివాసానికి వెళ్లి కలిశారు. కౌన్సిలర్ వసంతరావు, బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానిక నేతలు

మన్‌కీబాత్‌ను వీక్షించిన బీజేపీ నేతలు



తేజస్వీ కాలనీలో రాచూరి రాజశేఖర్ తదితరులు

రాజేంద్రనగర్: భారత్‌ను అన్ని రంగాల్లో ప్రపంచ పటంలో ముందు వరుసలో నిలబెట్టేందుకు ప్రధాని ఎనలేని కృషి అందిస్తున్నారని రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.బాబురావు నివాసంలో ప్రధాని నరేంద్రమోదీ 104వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి సందీప్‌ముదిరాజ్, డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు తొండుపల్లి మల్లేష్, నర్సింహ్మ, లక్ష్మీనారాయణ, అరుణ్ తదితరులున్నారు.

దేశాభివృద్ధే లక్ష్యం..

అత్తాపూర్: తేజస్వీనగర్‌లో ప్రధాని 104వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి శక్తి కేంద్రం ఇన్‌చార్జి రాచూరి రాజశేఖర్, సహ ఇన్‌చార్జి దుర్గాప్రసాద్, విస్తారక్ సంతోష్‌వర్మ, బూత్ అధ్యక్షుడు అన్కుర్ బన్సల్, మహిళా ప్రముఖ్ నిర్మల, సీతారామశాస్త్రి, సయ్యద్ సాదిక్ అలీ, ఖుల్దీప్ అగర్వాల్, బిరాధర్, అర్జున్‌సింగ్, ముస్తఫా తదితరులున్నారు.

హైదర్‌గూడలో...

చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి నివాసంలో ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాలతో పాటు అనేక విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సాబాద విజయ్‌కుమార్, సాయియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు





బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్‌లో మల్లన్న స్వామి బోనాలు వైభవంగా జరిగాయి. ఆదివారం స్వామివారి దేవాలయంలో భక్తులు బోనాలను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్లు అస్లాంబిన్ అబ్దుల్లా, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కో– ఆప్షన్ సభ్యులు మలాకీ రత్నం, జగదీష్, యూత్ ప్రెసిడెంట్ మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు..

బండ్లగూడ: హైదర్షాకోట్ శాంతినగర్ కాలనీలో గాలి పోచమ్మ దేవాలయంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. దేవత విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి ఆదివారానికి 41 రోజులు పూర్తైన సందర్భంగా గాలి పోచమ్మ దేవాలయంలో మండల పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, గ్రామస్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

సత్యనారాయణ సేవలు ఎనలేనివి

అత్తాపూర్: రాజేంద్రనగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దివంగత జాలిగం సత్యనారాయణ లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జాలిగం చిత్తారి అన్నారు. అత్తాపూర్‌లో బీజేఆర్ కమ్యూనిటీహాల్‌లో సత్యనారాయణ 10వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన ఎలాంటి పక్షపాత వైఖరి లేకుండా పారదర్శకంగా అభివృద్ధి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జనార్దన్, మునిష్, నరేందర్, దర్శన్, శోభన్‌బాబు, అమర్, అరవింద్, శ్రీనివాస్, జాలిగం నాని తదితరులు పాల్గొన్నారు.

నియామకం

రాజేంద్రనగర్: బహుజన శోషిత్ సమాజ్ సంఘర్ష్ సమతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా రాజేంద్రనగర్‌కు చెందిన గుర్రంపల్లి శామల్‌రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు మంజు జటావ్ తెలంగాణ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శామల్‌రాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, కన్సీరామ్‌ల ఆశయాలు, ఆలోచనలు ప్రజలకు వివరిస్తామన్నారు. పెట్టుబడిదారి దోపిడీ నుంచి ప్రజలు బయటపడేందుకు కృషి చేస్తానన్నారు.

శ్రీశైలం సేవలు మరువలేనివి

మణికొండ: ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ విద్యార్థుల ఉన్నతితో పాటు తాను పనిచేసిన పాఠశాలలు, తన స్వగ్రామం అభివృద్ధికి తన వంతుగా చేసిన సేవలు మరవలేనివని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. అశోక్‌కుమార్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరావులు అన్నారు. నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 11 ఏళ్లుగా తెలుగు పండిత్‌గా పనిచేస్తూ.. ఈనెల 4న అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన మోర శ్రీశైలం సంతాప సభను ఆదివారం నార్సింగి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియాడి ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. టీఆర్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శి కటకం రమేష్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, లోకేశ్వర్, ప్రధాన కార్యదర్శి జామ కుశాల్, మొయినాబాద్ ఎంఈఓ వెంకటయ్య ఉపాధ్యాయులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

శంషాబాద్: పట్టణంలోని కొత్వాల్‌గూడ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ.. ఇటీవల హఠాన్మరణం చెందిన హెప్సిబా కుటుంబానికి ఆర్థిక చేయూతను అందించారు. టీఎస్‌యూటీఎఫ్ సభ్యురాలైన ఆమె కుటుంబానికి ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ ద్వారా రూ. 6 లక్షల చెక్కును ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ఉపాధ్యాయులకు అండగా ఉండేందుకు ఈ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి రవి తదితరులున్నారు.

పీఅండ్‌టీ కాలనీలో ఓటరు నమోదు కేంద్రం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రజలు కేంద్రానికి వచ్చి తమ ఓటరులిస్టులో తప్పొప్పులను సరి చూసుకున్నారు. ఇప్పటి దాకా ఓటరుగా నమోదు చేసుకోని యువతీ యువకులు కొత్తగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు వారి దరఖాస్తులను తీసుకుని అప్‌డేట్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బండ్లగూడ: కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయిస్తూ.. ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలోని హైటెన్షన్ లైన్ కింద ఉన్న 60 ఫీట్ రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గుంతలమయమైన రోడ్లతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో సమస్యలను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాల మేరకు హెచ్‌ఆర్‌డీసీఎల్ నిధులతో రోడ్డు పనులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తైతే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హెచ్‌ఆర్‌డీసీఎల్ డీఈ సత్యనారాయణ, ఏఈ మురళీకృష్ణ, సీనియర్ నాయకులు పాపయ్యయాదవ్ తదితరులున్నారు.



బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్

ముదిరాజ్‌లను విస్మరిస్తే సహించం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపడుతున్న మండల నాయకులు

మణికొండ: రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లకు బీఆర్‌ఎస్‌పార్టీ అధినేత కేసీఆర్ విస్మరించి ఒక్క ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవటాన్ని గండిపేట మండల ముదిరాజ్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆదివారం మంచిరేవుల నుంచి నార్సింగి అంబేడ్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల ముదిరాజ్ మహాసభ నాయకులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మరోసారి పునరాలోచన చేసి ముదిరాజ్‌లకు సముచిత స్థానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిని ఎమ్మెల్యేగా నిలబెట్టి గెలిపించుకుంటామన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్‌తో బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలని బీసీలకు సంపూర్ణ మద్దతు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. గణేష్‌ముదిరాజ్, శ్రీనివాస్, వెంకటేష్, ప్రవీణ్, పాండు, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ల నాయకులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

అత్తాపూర్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. హైటెక్‌సిటీలో జరిగిన యోగా ఫెస్టివల్‌లో అత్తాపూర్ ఐసీ గ్రూప్ యోగా సభ్యులు మెడల్స్ సాధించారు. సూర్య నమస్కారం పోటీల్లో బండ్లగూడ సుధాకర్ ఆధ్వర్యంలో బోజిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, సోనీ, సోమేష్‌లు పాల్గొన్నారు. ఉత్తమ యోగాసనాలు వేసి గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. యోగా సభ్యులు అవార్డులు సాధించడంతో యోగా గురువు సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. యోగా గురువు బండ్ల సుధాకర్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రోజూ యోగాసనాలు వేయాలన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్, కాకుళారం కృష్ణ, మ్యాడం రాము తదితరులున్నారు.



యోగా సభ్యులను సన్మానిస్తున్న నారగూడెం మల్లారెడ్డి

శారదాధామంలో ముగిసిన సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్తలు

బండ్లగూడ: భారతీయ సాహిత్య రచనా సంరక్షణకు జాతీయ సాహితీవేత్తలు కృషి చేయాలని అఖిల భారత ప్రధాన కార్యదర్శి పవనపుత్ర బాదల్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ శారదాధామంలో అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో రెండ్రోజుల సదస్సు ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన భారతీయ విజ్ఞానం, జ్ఞానం, గురు పరంపర, జ్ఞాన పరంపర, సాహిత్య సాధనలో భారతీయులు ప్రపంచ ప్రఖ్యాతి పొందారన్నారు. భారతదేశ పరిస్థితులు నూతన పోకడలు భారతీయ సాంస్కృతికి భిన్నంగా ఉన్నాయన్నారు. వాటి స్థానంలో నూతన భారత్‌కు సాహిత్యం రావాల్సిన అవసరం ఉందని సాహితీ వేత్తలకు పిలుపునిచ్చారు. దాదాపు 12 విషయాలపై చర్చ జరిగిందని, బాల సాహిత్యం, నారి సాహిత్యం, ఆధునిక, జానపద, ఆధ్యాత్మిక సాహిత్యం దేశ ప్రజల జీవితాలను ప్రభావితం చేసేలా ఉండాలని ఆచార్య కసిరెడ్డి అన్నారు. భాస్కరయోగి, జయదేవ్, కృష్ణడ్, వీరకాంతం, ఆంజనేయరాజు, అనంత శంకర్, కే.పీ.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• ఓటరు నమోదుకు స్పందన



బండ్లగూడ జాగీర్‌లోని సాయిశక్తి సింఫనీ అపార్ట్‌మెంట్‌లో కొత్త ఓటర్ల నమోదు, కరెక్షన్‌ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది ఎన్‌రోల్ చేసుకున్నట్లు నిర్వాహకుడు గౌతమ్ తదితరులు తెలిపారు. – రాజేంద్రనగర్

ఆకట్టుకున్న ఈఎంయూఎన్ ఎడిషన్

శేరిలింగంపల్లి: విద్యార్థుల ఎపిస్టెమో మోడల్ యునైటెడ్ నూషన్స్ (ఈఎంయూఎన్) నాలుగవ ఎడిషన్ కార్యక్రమం ఆకట్టుకుంది.నల్లగండ్లలోని ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమాన్ని పర్యావరణ వేత్త, స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ ఐశ్వర్యబుగ్గన చేతుల మీదుగా ప్రారంభించారు. యునైటెడ్ నేషన్ హ్యూమన్ రైట్ కౌన్సిల్, యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ అండ్ క్రైమ్, నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా కమిటీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాయింట్ క్రైసిస్ కమిటీ, ఇంటర్నేషనల్ ప్రెస్ వంటి కమిటీలను విద్యార్థులు వేసుకొని పలు అంశాలపై లోతైన చర్చలు జరిపారు. ముఖ్యంగా పలు దేశాల సరిహద్దు నేరా సమస్యలు, జాత్యాహంకారం, జాతి వివక్ష, జెనోఫోబియా, సంబంధిత అసహనాన్ని ఎదుర్కోవడం వంటి అంశాలపై చర్చించారు. మూడ్రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో మొదటిరోజు ప్రసంగాలు, రెండవ రోజు నృత్యం, లైవ్‌మ్యూజిక్‌తో విద్యార్థులు ప్రతిభచాటారు. మూడవ రోజైన ఆదివారం ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, వైస్ ప్రిన్సిపల్ పద్మకొల్లి, వాణిమత్రి, పలువురు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రముఖులు